క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

మేయర్ పారిజాతతో ఠాక్రే



ఠాక్రేను సన్మానిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: గాంధీభవన్‌లో శనివారం హాత్ సే హాత్ జోడో అభియాన్ సన్నాహక సమావేశం నిర్వహించారు. టీపీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి మానిక్‌రావు ఠాక్రే ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఠాక్రేను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ మహిళా అధ్యక్షురాలు అమృతానాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

కందుకూరు: నియోజకవర్గం పరిధిలోని నిరుద్యోగ యువతకు ఇంద్రారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో పీజేఆర్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకుడు గుండాల సురేశ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రి సబితారెడ్డి, ట్రస్ట్ చైర్మన్ పి.కార్తీక్‌రెడ్డి సహకారంతో నిర్వహించే ఈ శిక్షణ తుక్కుగూడలోని లాలాశ్రీ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 27 నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు కొనసాగుతాయని వివరించారు. ఈ శిక్షణలో విద్యార్థులకు 25గ్రాండ్ టెస్టులు, గ్రూప్–4,3,2 తదితర పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందజేస్తామన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు సెల్ 9010611428, 9505194161 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఘనంగా హోమం



ప్రవచనం చేస్తున్న గురూజీ

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో అమావాస్యను పురస్కరించుకుని శనివారం బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి చేసి భక్తులకు గురూజీ ఆశీర్వాదం అందించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గురూజీ మాట్లాడుతూ.. ప్రతి నిత్యం కొంత సమయాన్ని భగవంతుడి సేవలో గడపాలన్నారు. దీంతో సమాజంలో ఎదురయ్యే ఆటుపోట్లను తట్టుకునే ఆత్మస్థైర్యం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పెయింటర్ అదృశ్యం



చౌహాన్ సందీప్

మీర్‌పేట: పని కోసమని వెళ్లిన పెయింటర్ కనిపించకుండా పోయిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ ఉదయ్‌భాస్కర్ కథనం ప్రకారం.. జిల్లెలగూడ దాసరి నారాయణరావు కాలనీకి చెందిన చౌహాన్ సందీప్ (30) వృత్తిరీత్యా పెయింటర్. ఈ నెల 19న ఉదయం రోజు మాదిరిగా బడంగ్‌పేటలో పెయింటింగ్ పనికి వెళ్తున్నానని సందీప్ ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సందీప్‌కు మతిస్థిమితం సరిగ్గా లేదని, ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో భార్య సబిత శనివారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధులకు ఆటంకం.. వ్యక్తి రిమాండ్

మీర్‌పేట: తమ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై మీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. అల్మాస్‌గూడ వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన గాలయ్య (45) పలుమార్లు మద్యం మత్తులో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సిబ్బంది విధులకు ఆటంకం కలిగిస్తున్నాడు. ఈ మేరకు పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు.

పీఏసీఎస్ డైరెక్టర్ మృతి



రఘుమారెడ్డి (ఫైల్)

తుక్కుగూడ: మహేశ్వరం ప్రాథమిక రైతు సేవాసహకార సంఘం (పీఏసీఎస్) డైరెక్టర్, తుక్కుగూడ బీజేపీ సీనియర్ నాయకుడు చింతల రఘుమారెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ మేరకు ఆయన శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

రక్షణ కంచె ఏర్పాటు చేయరూ..!

నిండుకుండలా చెరువులు
- సెల్ఫీల సరదాతో ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్న యువత



చెరువు వద్ద ఫొటోలు దిగుతున్న పర్యాటకులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల పెద్ద చెరువు మూడేళ్లుగా కురుస్తున్న వర్షాలకు నిండుకుండలా మారింది. దీంతో చెరువు అందాలు చూసేందుకు నిత్యం పర్యాటకులు వస్తున్నారు. దాదాపుగా అరకిలోమీటరకు పైగా విస్తరించి ఉన్న ఈ చెరువు కట్టపై నుంచి వాహనాల రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉండడంతో ప్రజల తాకిడి పెరిగింది. రావిర్యాల సమీపంలో వండర్‌లా అమ్యూజ్‌మెంట్ పార్క్ ఉండటంతో ఈ ప్రాంతంలో పర్యాటకుల రద్దీ కూడ ఎక్కువ. చెరువులో నిండి ఏడాది కావస్తున్నా మున్సిపాలిటీ అధికారులు మాత్రం ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. చెరువుకు సమీపంలో గృహావాసాలు ఉండటంతో స్థానికంగా ఉండే చిన్నారులు సైతం చెరువు దగ్గరకు వెళ్తున్నారు. యువతీయువకులు చెరువులోకి దిగి సెల్ఫీలు దిగుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తోందనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ప్రమాదకరంగా మారిన రోడ్డు

ఈ చెరువు కట్ట నుంచి దిగువ భాగంలోకి నీరు జాలు పారడంతో కట్టకిందనున్న ఆర్‌సీఐ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో రేండేళ్లుగా వాహనదారులు కట్ట మీద ఉన్న మట్టి రోడ్డు మీదుగా ప్రయాణం చేస్తున్నారు. నిత్యం వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డంతా గుంతలమయంగా మారింది. ప్రమాదాలు సంభించక ముందే అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని, చెరువు చుట్టు రక్షణ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

"రక్షణ కంచె ఏర్పాటు చేయాలి



రావిర్యాల చెరువు పూర్తిగా నీటితో నిండిపోయింది. దీంతో యువతీయువకులు, కట్టపై నుంచి ప్రయాణం చేసేవారు సెల్ఫీలు దిగేందుకు చెరువు చెంతకు వస్తున్నారు. రక్షణ కంచెలు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాలి. మట్టి రోడ్డును సైతం మరమ్మతులు చేయాలి. – నవీన్‌రెడ్డి, రావిర్యాల

ఆంగ్ల పదజాల పోటీల్లో విఘ్నేష్ సత్తా

ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లెలగూడ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి



విఘ్నేష్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం సరళారెడ్డి, ఉపాధ్యాయులు

మీర్‌పేట: క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఎల్‌బీనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఆంగ్ల పదజాలం పరీక్ష(ఒకాబులరీ టెస్ట్)నిర్వహించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొనగా, మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి విఘ్నేష్ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో 2వ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా విఘ్నేష్‌ను పాఠశాలలో హెచ్‌ఎం సరళారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. జిల్లా స్థాయిలో తమ పాఠశాల విద్యార్థి ప్రతిభ కనబర్చడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సేవలోనే సంతృప్తి

డీపీఎస్ చైర్మన్ కొమురయ్య

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి నాదర్‌గుల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్)లో శనివారం జై ఆఫ్ గివింగ్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల చైర్మన్ మల్కా కొమురయ్య మాట్లాడుతూ.. ఏదైనా ఎదుటివారి నుంచి తీసుకుంటే కలిగే ఆనందం కన్నా మనస్ఫూర్తిగా మనం ఇస్తే కలిగే ఆనందం వందరెట్లు ఎక్కువ అన్నారు. అనాథలు, అభాగ్యులు, పేదలు, తల్లిదండ్రులను కోల్పోయినవారిపట్ల దయ, జాలి, కరుణ ఉండాలనేది ఈ కార్యక్రమం ఉద్దేశం అన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటే స్వీకరించినవారు ప్రపంచ చరిత్రలో నిలిచిపోయి పేరు ప్రఖ్యాతులు గడించి మహానుభావులుగా ఎదిగారని గుర్తు చేశారు. ఇవ్వడంలోనే ఉన్న సంతృప్తి మరే దానిలో కనిపించదని అన్నారు. విద్యార్థులు వితరణ చేసిన నిత్యావసర సరుకులను అనాథ ఆశ్రమాలకు అందజేస్తామని వెల్లడించారు. అనంతరం విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహించారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో ఖేలోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మజ్యోతి తురగ, కార్యనిర్వాహణాధికారి యశస్వి, లక్ష్మీ, ఆనందిత, అర్పిత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో క్షయ నివారణ

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కోశాధికారి రాఘవరెడ్డి



పౌష్టికాహారం అందజేస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

హుడాకాంప్లెక్స్: మందులతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే క్షయ వ్యాధిని నివారించవచ్చునని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కోశాధికారి రాఘవరెడ్డి అన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. టీబీ నివారణకు స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీఓలు, ప్రైవేటు రంగ సంస్థలు కృషి చేసి బాధితులకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అర్చన, డాక్టర్ కిరణ్‌కుమార్, సూపర్‌వైజర్ నాగిరెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అనాథల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రవి



రాంరెడ్డిని సన్మానించిన సబితారెడ్డి

బడంగ్‌పేట్: అనాథ చిన్నారుల సంక్షేమం, సంరక్షణ బాధ్యతను ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ.. శనివారం ఎమ్మార్పీఎస్ బాలాపూర్ మండల శాఖ నాయకులు విద్యాశాఖమంత్రి సబితారెడ్డికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బొర్ర రవి మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఫౌండర్ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులకు వినతిపత్రాలను ఇస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఉన్న అనాథ చిన్నారుల బాధ్యత ప్రభుత్వమే తీసుకుని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనాథ పిల్లలను గుర్తించి వారి సంరక్షణ, చదువులు, గుర్తింపు అన్ని ప్రభుత్వమే తీసుకుని వారికోసం ప్రత్యేక గురుకులాలు, అలాగే కేజీ టూ పీజీ విద్యాలయాలు ఏర్పాటు చేసి రిజర్వేషన్లను ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని కోరారు. అనాథల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రావుగళ్ల బాబు, మద్దిలేటి, నరసింహ, శంకర్‌రావు, రమేశ్, కట్ట జగన్, శ్రీనివాస్, నవీన్‌కుమార్, ఉపేంద్ర, అనంతయ్య, బాలరాజ్, శ్రీకాంత్, జనార్ధన్, ఆనంద్ తదితరులున్నారు.

రాంరెడ్డికి మంత్రి సన్మానం

అల్మాస్‌గూడ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. నాయకులు, అభిమానులు, మహిళలు కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మంత్రి సబితారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయన్ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంగేటి లక్ష్మారెడ్డి, రఘునందన్‌చారి, ఎల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బొర్ర మాధవరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రె కృష్ణ, యూత్ ప్రెసిడెంట్ చిత్రం సాయి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సంతోశ్, పలువురు కార్పొరేటర్లు, పలు కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఉన్నారు.

ఎనిమిది నెలలుగా అన్నదానం



అన్న ప్రసాద వితరణలో పాల్గొన్న కమిటీ సభ్యులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మండల కేంద్రంలో బంగారు మైసమ్మ కాశీ వైద్యనాథీశ్వర స్వామి ఆలయంలో ఎనిమిది నెలలుగా నిత్యాన్నదాన ప్రసాద వితరణ కొనసాగుతోంది. అన్నదాన పథకాన్ని ప్రారంభించి నేటికీ 264 రోజులు పూర్తయింది. అమావాస్యను పురస్కరించుకుని శనివారం 600 మందికి పైగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్ ట్రస్టీలు బేర బాలకిషన్, ఆకుల అరవింద్‌కుమార్ మాట్లాడుతూ మూడు సంవత్సరాల క్రితం శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని భక్తుల సహకారంతో అభివృద్ధి చేసి నిత్య పూజలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గోల్డెన్ వాకర్స్ టీం సభ్యులు నగేష్‌గుప్తా, అంజయ్యగుప్తా, ప్రభాకర్‌గుప్తా, లక్ష్మీనారాయణ, మూర్తిగుప్తా, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మలు తొలగింపు, మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆటోనగర్, పెద్దఅంబర్‌పేట ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. 11కేవీ విష్ణు థియేటర్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

నేడు గడికోట మైసమ్మకు బోనం

మహేశ్వరం: గడికోటలో కొలువుదీరిన కోట మైసమ్మ అమ్మవారికి ఆదివారం శివగంగ రాజరాజేశ్వర ఆలయం నుంచి బోనం సమర్పించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్‌గౌడ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శివగంగ రాజరాజేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలకు నెల రోజుల ముందుగా కోట మైసమ్మ తల్లికి బోనం సమర్పించి అనంతరం ఉత్సవాల పనులు చేపట్టడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. ఈ ఉత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం బాలికలు–స్వీయరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి(ఏపీఓ) కె.అనిత హాజరై మాట్లాడారు. యుక్త వయస్సులో గల బాలికలు లైంగిక సమస్యలను ఎలా ఎదుర్కోవాలి, స్వీయ రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎవరైనా ప్రమాదానికి గురైతే వెంటనే 108కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ఆకతాయిలతో ఇబ్బందిపడితే డయల్ 100కు ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివారలు గోప్యంగా ఉంచుతామన్నారు. పాఠశాలలో సమయాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సి.రాజిరెడ్డి, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, లావణ్యరేఖ, సుమలత, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే

కడ్తాల్: ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని కరాటే మాస్టర్ సతీశ్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో 6నుంచి 10వ తరగతి చదివే బాలికలకు ఉచిత కరాటే శిక్షణ తరగతులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాస్టర్ సతీశ్ మాట్లాడుతూ.. సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టాలంటే బాలికలు కరాటే తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఓ అనిత, కోచ్ మహేశ్ తదితరులు ఉన్నారు.

వసతుల కల్పనకు చర్యలు

కమిషనర్ నాగేశ్వర్



కమిషనర్‌కు శ్మశాన వాటికలో సమస్యలు వివరిస్తున్న బాబు తదితరులు

మీర్‌పేట: శ్మశానవాటికలో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని మీర్‌పేట్ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్ తెలిపారు. మీర్‌పేట సిర్లాహిల్స్ శ్మశాన వాటికలో స్నానాల గదులు, నీరు, విద్యుత్ సౌకర్యం తదితర సదుపాయాలు కల్పించాలని కాటికాపరుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి బాబు కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా కమిషన్ శనివారం శ్మశానవాటికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్వరమే సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. కమిషన్ వెంట ఏఈ శ్రీనివాసులు, 27వ డివిజన్ కార్పొరేషర్ భిక్షపతిచారి, యాదగిరి చారి, ధనుంజయ, జితేందర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బసవేశ్వర విగ్రహావిష్కరణ

ఏర్పాట్లు పూర్తి
- హాజరుకానున్న ఎంపీలు రాములు, బీబీ పాటిల్



బసవేశ్వర విగ్రహం

కడ్తాల్: మండల కేంద్రంలో శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన, హనుమాన్ ఘడ్ ఆలయ ఆవరణలో, బసవేశ్వరుడి విగ్రహావిష్కరణకు సంబంధించి వీరశైవ లింగాయత్ లింగ బలిజ సమాజం సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో విగ్రహదాత, వీరశైవ లింగాయత్ లింగ బలిజ సమాజం మండల అధ్యక్షుడు నేతి ఈశ్వరప్ప మాట్లాడుతూ.. ఆదివారం విశ్వగురు మహాత్మా బసవేశ్వర విగ్రహవిష్కరణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు, ప్రజాప్రతినిధులు తరలిరానుండటంతో భారీ ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, వీరశైవ లింగాయత్ లింగ బలిజ సమాజం రాష్ట్ర అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప వివిధ పార్టీల నాయకులు హాజరవుతారని చెప్పారు. మండల కేంద్రంలో భారీ ర్యాలీ అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ బసవేశ్వరుడి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. లింగాయత్ సమాజం సభ్యులతో పాటు, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల నుండి భక్తులు తరలిరావాలని లింగాయత్ సమాజం సభ్యులు సర్వేశ్వర్, డాక్టర్ రమేశ్ అయ్యగార్, మల్లప్ప, శరణప్ప కోరారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: తమ ఇళ్లతో పాటు పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీసాయి గ్రామర్ హైస్కూల్ విద్యార్థులు, జీహెచ్‌ఎం, రాంకీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం గౌతంనగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పరిశుభ్రత లోపిస్తే అంటు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఇండ్లలోని చెత్తను రోడ్లపక్కన వేయవద్దని, జీహెచ్‌ఎంసీ ఆటో కార్మికులకు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా వారికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో గౌతంనగర్ కాలనీ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి, శ్రీ సాయి గ్రామర్ హైస్కూల్ కరస్పాండెంట్ శిరీష, విద్యార్థులు, ఆధ్యాపక బృందం, డివిజన్ నాయకులు భవానీ ప్రవీణ్‌కుమార్, రమణారెడ్డి, దాసరి జయప్రకాష్, ఓంకార్, శానిటేషన్ సూపర్‌వైజర్ బుచ్చయ్య పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

చైతన్యపురి కాలనీలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కాలనీవాసులు శనివారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాలనీలో నూతన రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, డ్రైనేజీ, లైబ్రరీ సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. నూతన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్టు ఎమెల్యే వారికి తెలిపారు. లైబ్రరీ, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూస్తానని అన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, బీఆర్‌ఎస్ డివిజన్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, జాఫర్ పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కడ్తాల్: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పంచాయతీ పాలకమండలి సహకారంతో, కామినేని హాస్పిటల్ ఎల్‌బీనగర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి ఎంపీటీసీ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసని సమావేశంలో వారు కామినేని ఆస్పత్రి వైద్యులను అభినందించారు. ఈ శిబిరంలో కామినేని వైద్యులు సాయికృష్ణ, అంచలిబాత్రా, దేవేందర్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, మాజీ సర్పంచ్ వేణు గోపాల్, వార్డు సభ్యులు భిక్షపతి, మల్లయ్య, మహేశ్, గణేశ్, ఎట్టమ్మ, వెంకటయ్యగౌడ్, నాయకులు అశోక్, రాంచందర్, చందోజీ, నాగార్జున, మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గొర్లకు బదులు నగదు అందజేయండి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జీఎంపీఎస్ నాయకులు

జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం

కడ్తాల్: మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు గొర్లకు బదులుగా నగదు అందజేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) జిల్లా అధ్యక్షుడు గౌర శ్రీశైలం అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చేగూరి వెంకటేశ్, పెంటయ్యలతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొల్లకురుమల సంక్షేమానికి మరింత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతీ గ్రామంలో షెడ్లు నిర్మించి రూ.30లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు క్యామ చంద్రశేఖర్, మర్ల వెంకటేశ్, మల్లేశ్, బీరప్ప, చిన్న మల్లయ్య, కొమురయ్య, ఆంజనేయులు, శ్రీశైలం, లింగం, యాదయ్య, కృష్ణయ్య, మహేశ్, శ్రీను, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

జీఎంపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఆమనగల్లు: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం జీఎంపీఎస్ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆమనగల్లు ఎస్‌ఐ సుందరయ్య, జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. జీఎంపీఎస్ నాయకులు పెంటయ్య, మల్లయ్య, అంజయ్య, తిరుపతయ్య, శ్రీశైలంయాదవ్, గిరి, శ్రీను, వెంకటేశ్, మల్లేశ్, అశోక్, సురేశ్, నరేశ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.